



క్యాన్సర్ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న మంత్రి భరత్, కలెక్టర్ రంజిత్ బాషా

# ఆక్రమణలపై విజిలెన్స్ విచారణ చేయించాలి

- స్థానిక సమస్యలపై వాడి వేడి చర్చ
- తాగునీటిని ప్రతిరోజు సరఫరా చేయాలి
- రాత్రిపూట కాకుండా పగలు వదలాలి
- రూ.1.85 కోట్ల నిధుల ఖర్చుకు ఆమోదముద్ర

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

పార్కులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, గతంలో జరిగిన పనుల్లో జరిగిన ఆగ్రమణలపై విజిలెన్స్ అధికారులతో విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని మంత్రి,ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు కోరారు. పాణ్యం నియోజకర్గం పరిధిలోని 16 వార్డులకు ప్రతిరోజు తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి కోరారు. తాగునీటి సరఫరా రాత్రిపూట కాకుండా పగలు వదలాలని మంత్రి టిజి.భరత్ ఆదేశించారు. శుక్రవారం ఎస్‌బిఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో సర్వసభ్య సాధారణ సమావేశం మేయర్ రామయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మంత్రి టిజి.భరత్‌ను ఘనంగా సన్మానించారు. నూతనంగా బదిలీపై వచ్చిన అధికారులందరూ పరిచయం చేసుకున్నారు. రతన్ టాటా మృతి పట్ల సంతాప సూచికంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ఆరు అజెండాలను చదివి వినిపించారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, మేయర్ బివై రామయ్య చెప్పారు. పరిధిలోని పార్కులు, రోడ్లు, స్థలాలు కబ్జాలు చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో రచ్చ రచ్చ చేశారు. మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ కర్నూలు, కల్లూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో తాగునీరు రాత్రిపూట కాకుండా పగలు ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో మినిట్స్ రాసి వచ్చే కౌన్సిల్లో వచ్చిన సమస్యలకు పరిష్కార మార్గాలు ఎన్ని చేశారని తెలియజేయాలన్నారు. కమ్యూనిటీ హాల్స్‌ను చిన్నచిన్న ఫంక్షన్లు చేసుకోవడానికి వీలుగా ఉండేటట్లు చూడాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యలపై రిపోర్టు తయారు చేయాలని సూచించారు. నగరం చుట్టూ నదులు ఉన్నా రోజు విడిచి రోజు మంచినీరు వదిలే పరిస్థితి ఉందన్నారు. అలాకాకుండా పగలే తాగునీటిని అందించే విధంగా శాశ్వత పరిష్కారం చూపాలని చెప్పారు. స్మార్ట్ సిటీ తరహాలో కర్నూలు అభివృద్ధి చేయాలని, అప్పుడే నిధులు దండిగా వచ్చి నగరం సుందరంగా తయారవుతుందన్నారు. గతంలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయించి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. 2022లో ఉన్న పాత పద్ధతి ప్రకారంగా సర్వహక్కులు కార్పొరేషన్‌కు ఉండేటట్లు చేసినట్లయితే అభివృద్ధి వేగవంత మవుతుందన్నారు.



మంత్రి టిజి.భరత్‌ను సన్మానిస్తున్న మేయర్, కమిషనర్

### 16 వార్డుల్లో రోజూ తాగునీరందించాలి

**- పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత**



కర్నూలు నగరంతో పాటు పాణ్యం పరిధిలోని కల్లూరు ప్రాంతమంతా 16 వార్డులలోని ప్రజలు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నారని,తాగునీరు అందించడంలో వివక్ష చూపుతున్నారన్నారు. రోజువిడిచి రోజు కాకుండా రోజూ అన్ని వార్డులకు సమానంగా తాగునీరందించే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు నుండి గుంటూరు వెళ్లే నేషనల్ హైవే నాలుగు లైన్ల కాజ్‌వేగా విస్తరణ పనులు జరుగుతున్నాయని, అందులో భాగంగా 120 అడుగుల రోడ్డును 100 అడుగులకు కుదించడం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. జనాభాకనుగుణంగా ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉన్న రోడ్లను అవసరమైతే విస్తీర్ణం పెంచాలి తప్ప తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. నగరంలో రూ.80 కోట్ల నిధుల అవినీతి జరిగిందని విజిలెన్స్‌తో విచారించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని చెప్పారు. పాణ్యంలో ఉన్న 16 పార్కులు కబ్జాకు గురయ్యాయని పార్కు స్థలాలకు పట్టాలకు ఇచ్చారని, కబ్జాలపై కమిటీ వేసి పార్కుస్థలాలలో పట్టాలు ఇచ్చిన వాటిని విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్లు తమ తమ పరిధిలో ఉన్నటువంటి తాగునీటి సమస్యలను గురించి విన్నవించే సూచనలు, సలహాలను ఇచ్చారు. అందుకు కమిషనర్ తాను ప్రత్యక్షంగా సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కారం చూపే విధంగా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశిస్తానని చెప్పారు. కార్పొరేటర్ సాంబశివుడు మాట్లాడుతూ మా ప్రాంతంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించి మూడేళ్లయినా ఇంతవరకు ప్రారంభం కాలేదని, అధికారులకు తెలియజేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని, ప్రజల ఆరోగ్యం అధికారులకు పట్టడం లేదా అని ప్రశ్నించారు. అందుకు సమాధానంగా ఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నవంబర్ 15లోపు అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. ఆపరేటర్ లక్ష్మారెడ్డి, సుజాతలు మాట్లాడుతూ మా ప్రాంతంలో రోడ్లు గుంతల మాయమయ్యాయని, కనీసం ప్యాచ్ వర్కులు అయినా చేయాలని కోరారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు వారి డివిజన్లలోని సమస్యలను వివరించారు. కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ లో ముగ్గురు ఉండాల్సిన సర్వేర్లు ఒక్కరు ఉండేవారు అతను కూడా బదిలీపై వెళ్లిపోయారు. ఎవరూ లేరని, సర్వేర్ వచ్చిన తర్వాత తీసుకొని వాటిని పరిరక్షించే బాధ్యతను తీసుకుంటామన్నారు.

### అందరం కలిసి నగరాభివృద్ధికి పాటుపడదాం

**- మేయర్ బివై.రామయ్య**

పార్టీలకతీతంగా అందరం చర్చించుకుని సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కార మార్గంగా పయనించాలి తప్ప ప్రజా ప్రతినిధులు ఒకరికొకరు దూషించుకోరాదని సూచించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, అదనపు కమిషనర్ ఆర్ జివికృష్ణ, ఎస్‌ఇ రాజశేఖర్, ఎంహెచ్‌ఓ విశ్వేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి జునీద్, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రదీప్ కుమార్, డిఇలు వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర, ఎమ్మెల్యే దస్తగిరి, మేయర్ బివై.రామయ్య

## క్యాన్సర్ హాస్పిటల్ సేవలను అందుబాటులోకి తెస్తాం

**- పరిశీలించిన మంత్రి టిజి.భరత్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలులో రాష్ట్రస్థాయి క్యాన్సర్ హాస్పిటల్ సేవలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని రాష్ట్రస్థాయి క్యాన్సర్ హాస్పిటల్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పలు విభాగాలు తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ 2019 జనవరిలో సీఎం చంద్రబాబు నాయుడు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి క్యాన్సర్ హాస్పిటల్లో అత్యున్నతమైన వైద్య సేవలు ప్రజలకు అందేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. రోగులు వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా ఇక్కడే ఉచితంగా వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## స్పష్టత లేని 'ఉచిత గ్యాస్'

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం అడుగులు ముందుకు వేసింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలోనే ఈ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ దీపావళి (అక్టోబర్ 31) నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 6.74 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 2.4 లక్షల దీపం కనెక్షన్లు కూడా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5.77 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 1.55 లక్షల దీపం కనెక్షన్లు, 33,732 పిఎం ఉజ్వల యోజన కనెక్షన్లు ఉన్నాయి. తొలుత గ్యాస్ సిలిండర్‌ను మామూలుగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.25 రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుదారుల ఖాతాలో జమ చేసేలా నిర్ణయించింది. మూడు ఉచిత సిలిండర్లు కూడా ఒక దాని తరువాత ఒకటి కాకుండా నాలుగు నెలలకాలానికి ఒక సిలిండర్ చొపన ఇవ్వనున్నారు. దీపావళి రోజు నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్ల డెలివరీని ప్రారంభించనున్నారు. అందు కోసం మూడు రోజుల ముందు నుండే సిలిండర్ల బుకింగ్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు డిబిటి ద్వారా లబ్ధిదారుల ఖాతాకు సిలిండర్ సొమ్మును జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. మూడు బ్లాక్ పీరియడ్లుగా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి జులై వరకూ ఒక పీరియడ్, ఆగస్టు నుంచి నవంబర్ వరకూ ఒక పీరియడ్, డిసెంబర్ నుంచి మార్చి వరకూ ఒక పీరియడ్‌గా నిర్ణయించారు. ఒక్కో పీరియడ్‌లో ఒక్క ఉచిత గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించనున్నారు. డిబిటి విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తే ప్రభుత్వం సిలిండర్ కొనుగోలు చేసిన మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయక పోతే ఎలా అని విని యోగ దారుల నుంచి సందేహం వ్యక్తం అవుతోంది. ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు రాకపోవడంతో ఈ పథకానికి అర్హులు ఎవరనేది స్పష్టత రాలేదు. విధివిధానాలు వచ్చే వరకూ తాము ఎలాంటి చర్యలు తీసుకోలేమని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

**మద్యంపై తమ్ముళ్ల కన్ను :** మంచి లాభాలు ఉన్న ప్రయివేటు మద్యం దుకాణాలపై తెలుగు తమ్ముళ్ల కన్ను పడింది. దుకాణాలకు దక్కించుకునేందుకు ముందు నుంచీ విశ్వప్రయత్నాలు చేశారు. లాటరీలో దుకాణం రాకుంటే ఇతర మార్గాల్లో దుకణాలను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అప్పటికీ కుదరకపోతే దుకాణంలో వాటా ఇవ్వాలని దుకాణదారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలను, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలను, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 204 మద్యం దుకాణాలను ఈ నెల 14న లాటరీ ద్వారా కేటాయించారు. 16 నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. ఆ లాటరీల్లో తెగులు తమ్ముళ్లకు దుకాణాలు అంతంత మాత్రమే దక్కాయి. దీంతో కొందరు టిడిపి నాయకులు మాత్రం అధికారం మాది...మద్యం దుకాణాలు కూడా మావే అంటూ విర్రవీగుతున్నారు. కొన్ని చోట్ల 30 శాతం వాటా ఇచ్చేందుకు దుకాణదారులపై బెదిరింపులకు పాల్పడి దుకాణాలు తెరచుకునేందుకు రాజకీయ అనుమతి నిచ్చారు. వాటాకు ఒప్పుకోకుంటే దుకాణాన్ని తెరచుకునేందుకు అనుమతి ఇవ్వడం లేదు. కొన్ని ప్రాంతాల్లో టిడిపి వారే దుకాణాన్ని దక్కించుకున్నా తమ వర్గం వారు కాకపోవడంతో దుకాణాల నిర్వహణను అడ్డుకున్నారు.

**అవీ..ఇవీ..అన్నీ:** పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్ అమర వీరులకు నివాళులు అర్పించారు. జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.




## రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడాలి : సిపిఎం

### కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :** కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో వంకను పూడ్చి ప్లాట్లు వేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వీడితగు చర్యలు తీసు కోవాలన్నారు. శుక్రవారం కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నా చేశారు. సిపిఎం కల్లూరు మండల కార్యదర్శి కె. మధు అధ్యక్షతన జరిగిన ధర్నాను ద్దేశించి జి.రామకృష్ణ మాట్లాడుతూ వడ్లోని వంకను ఆక్రమించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సుమారు 130 ఇళ్లలోకి నీళ్లు ప్రవేశించి దళిత ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అంతేకాక స్కూలు హాస్టల్‌లోకి నీళ్లు ప్రవేశించి పాములు తేళ్లు స్వైర విహారం చేస్తున్నాయన్నారు. వాటి నుండి పిల్లలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులదని, అటువంటి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇప్పటికే తహశీల్దార్, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఆర్‌డిఒ కార్యాలయం లోపలికి సిపిఎం నాయకులు వెళ్తుండగా పోలీసులు నిలువరించారు. టూటౌన్ ఎస్‌ఐ మోహన్ రెడ్డి జోక్యం చేసుకొని కర్నూలు ఆర్‌డిఒ దృష్టికి తీసుకువెళ్లారు. ఎఒవేణు గోపాలరావు స్పందించి మాట్లాడుతూ త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం పెద్దపాడుశాఖ కార్యదర్శిగోపి, పందిపాడు శీను, పెద్దపాడు గ్రామస్తులు యేసురాజు, చిన్నరాముడు, పెద్ద రాముడు, బజారి, రాజు, చిన్న భీమన్న, పెద్ద భీమన్న, మౌలాలి, శీను పాల్గొన్నారు.

## టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

**- డిఇఒగా బాధ్యతలు స్వీకరించి సామ్యూల్‌పాల్**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఈ విద్యాసంవత్సరంలో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామ్యూల్ పాల్ వెల్లడించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిఇఒగా సామ్యూల్ పాల్ బాధ్యతలను చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషను, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దృష్టి సారిస్తామన్నారు. ఈ మేరకు గత జిల్లా విద్యాశాఖ అధికారి కె. శామ్యూల్ విధుల నుండి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ కార్యాలయ సిబ్బంది పలువురు నూతన డిఇఒ సామ్యూల్ పాల్‌కు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు చేపడుతున్న డిఇఒ



## జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి మండిపాటు

**పంచలింగాలలో రీ సర్వే గ్రామసభ బహిష్కరణ**

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్**

భూ రీ సర్వే గ్రామసభ నిర్వహణపై జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి ముని కన్నన్ మండిపడ్డారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో శుక్రవారం గ్రామసచివాలయంలో భూ రీసర్వే గ్రామసభను రెవెన్యూ, సర్వే అధికారులు నిర్వహించారు. సభలో ఏర్పాట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, నిర్వహణకు అధికారుల హాజరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధానంగా సభలో గ్రామ స్వర్వే రికార్డులు, అందుబాటులో లేకపోవడం వల్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ జెసికి రిపోర్టు చేస్తానంటూ సభ నుంచి నిష్క్రమించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భూ హక్కు దారులు న్యూ రికార్డుల్లో చోటు చేసుకున్న వివిధ పొరపాట్లను సరిదిద్దుకునేందుకు అధికారులను కలిసి ఫిర్యాదులను అందజేశారు. ప్రధానంగా ఆన్‌లైన్ పేర్లు తప్పుగా నమోదవడం, భూ వ్యత్యాసం, జాయింట్ ఫీల్డ్ విభజన, భూ వర్గీకరణ వంటి సమస్యలు ఈ సభ దృష్టికి వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్, గ్రామ సర్వేయర్లు శ్రీకాంత్, రేణుక, తరుణ్, శివ, మంజు, నరేష్ సురేష్, విఆర్‌ఒలు మద్దిలేటి, భారతి పాల్గొన్నారు.

## ఆన్ లైన్ విధానాన్ని త్వరగా పునరుద్ధరించాలి : సిఐటియు

**ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ :** వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి దిగుబడులు అత్యధికంగా వస్తున్నాయని ఆన్‌లైన్ సరిగా పని చేయక కొన్ని ఇబ్బందులు వస్తున్నందున ఆ సమస్యను పరిస్కారం చేయాలని సిఐటియు మార్కెట్ యార్డ్ యూనియన్ల గౌరవ అధ్యక్షుడు టి.రాముడు, ఎం.వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటస్వామి, చిన్నబడేసా, మనోహర్, దస్తగిరి, కమిటీ సభ్యులతో కలిసి మార్కెట్ యార్డు సెక్రటరీ జయలక్ష్మిని కలిసి సమస్యను వివరించారు. వారు మాట్లాడుతూ గత మూడు రోజులుగా ఆన్‌లైన్ పనిచేయకపోవడం వల్ల సాయంత్రం 7 గంటలకు టెండర్ ఫారం వస్తుందని, దాని కారణంగా రాత్రంతా కాటాలు జరపవలసి వస్తుందన్నారు. దీనివలన రైతులు, కార్మికులు, కొనుగోలుదారులు అందరూ ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మార్కెట్ యార్డులో సిసి కెమెరాలు పనిచేయకపోవడం వలన రైతులు తెచ్చిన సరుకు రక్షణ లేదని, వెంటనే సిసి కెమెరాలను పునరుద్ధరించాలని కోరారు. కార్యదర్శి జయలక్ష్మి స్పందిస్తూ తప్పకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. లారీ హమాలి యూనియన్, కోతహమాలి యూనియన్, ఉల్లి పట్టుబడి హమాలి యూనియన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మార్కెయార్డును సందర్శించిన టి.రాముడు

## పేదల ఆకలితీర్చేందుకే అన్న క్యాంటీన్లు

**రూ 5 కే నాణ్యమైన, రుచికరమైన ఆహారం : మంత్రి మంత్రి టి జి భరత్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్:** పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని రూ.5 అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపర్ స్పెషాలిటీ విభాగం పక్కన ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి టిజి.భరత్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. కర్నూలు నియోజకవర్గంలో పేదలకు అవసరమైన ప్రదేశాలలో 3 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామని, ఇప్పటికే 2 అన్న క్యాంటీన్లను ప్రారంభించు కున్నామని, ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన 3వ అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులో ఉంచా మని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల రాయలసీమలోనే అతిపెద్ద ఆసుపత్రిఅని ఇక్కడికి ప్రజలు నిరంతరం పెద్ద సంఖ్యలో వస్తుంటారని.. వారికి తక్కువ ఖర్చుతో నాణ్యత గల ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించు కున్నామన్నారు. పేద ప్రజల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా కేవలం రూ.5 నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనాలను అందచేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో 5 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటి వరకు 4 అన్న క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు. కల్లూరు పరిధిలోని పరిమళ నగర్, సెట్కూర్ కార్యాలయం వద్ద, కలెక్టరేట్ ఆవరణలో, పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు సమీ పంలో మొత్తం 4 క్యాంటీన్లను ప్రారంభించా మన్నారు. ఈరోజు ప్రభుత్వ వైద్య శాలలో అన్న క్యాంటీన్ ప్రారంభించు కున్నా మని తెలిపారు. మంత్రి, కలెక్టర్ స్వ యంగా ప్రజలకు అల్పా హారాన్ని వడ్డించారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టూరిజం డైరెక్టర్ ముంతాజ్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి , స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సిఎస్.కె ప్రకాష్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.



## చెన్నై విత్తన ఉత్పత్తి అభివృద్ధి ప్రదర్శనలో కర్నూలు ఎంపి

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశ్రమల రాష్ట్రగా తీర్చిదిద్దేలా సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కర్నూలు ఎం.పి బస్తిపాటి నాగరాజు అన్నారు.. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో విత్తనాల వ్యాపారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సంస్కృతితో కలిపి విత్తన ఉత్పత్తిని ఎలా అభివృద్ధి చేయాలన్న దాని పై నిర్వహించిన ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు మాట్లాడుతూ కరువు వలసలతో వెనుకబడిన కర్నూలు జిల్లాలో విత్తనాల ఉత్పత్తి పరిశ్రమను తీసుకొచ్చి విత్తనాల అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు.



## అధికారులు లేక గోడకు వినతిని అంటించిన కాటికాపరులు

**పజాశక్తి-కర్నూలు క్రైమ్**

కాటికాపరుల సమస్యల పరిష్కారం కోసం తమగోడును ప్రభుత్వానికి తెలియజేయమని చెప్పేందుకు రెండు రోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నా. అధికారులు లేకపోవడంతో కర్నూలు మండలం ఆర్‌కె దుద్యాల గ్రామంలోని కాటికాపరులు తమ వినతిని సచివాలయం గోడకు అతికించి నిరసనను తెలిపారు. శుక్రవారం కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌కె దుద్యాల గ్రామంలోని సచివాలయ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, వినతిని సచివాలయ కార్యాలయానికి అతికించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కెజిబిఎస్ మండల నాయకులు మద్దిలేటి మాట్లాడుతూ స్మశానంలో గుంతలు తీసి పూడుస్తూ, కట్టెలు పేర్చి కాలుస్తూ చనిపోయిన వారికి అన్ని రకాల సేవలు చేస్తూ అత్యంత ప్రాచీన కాలం నుండే స్మశానంలో గుంతలు తీసే వృత్తినే నమ్ముకుని పనిచేస్తున్న కాటి కాపరులను నాలుగవ తరగతి ఉద్యోగస్తులుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అత్యంత ప్రాచీన కాలం నుండి ఈ సమాజం అంటగట్టవృత్తిని ఎంతో బాధ్యతాయుతంగా స్వీకరించి తరతరాలుగా అత్యంత భయంకరమైన వ్యాధులు ప్రబలి చనిపోయినా, రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి శరీర భాగాలు నుజ్జు నుజ్జు అయినా, హత్యకు గురైన వారిని అయినా ఆత్మహత్య చేసుకున్న వారినైనా మా చేతులతోనే పట్టుకొని వారికి అన్ని రకాల సేవలు చేసి, స్మశానవాటికలో జరిగే ఆఖరి కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతతో చేస్తున్నామన్నారు. ప్రపంచ దేశాలన్నిటిని వణికించిన కరోనా మహమ్మారి సమయంలో కూడా తమ తోటి కుటుంబ సభ్యులకు కరోనా వ్యాధి సోకి చనిపోతే ముట్టుకోలే పరిస్థితుల్లో కూడా చనిపోయిన వారిని ముట్టుకుంటే ఆ కరోనా మహమ్మారికి బలైపోయి చనిపోతామని తెలిసికూడా మా ప్రాణాలను పణంగా పెట్టి మా చేతులతో ముట్టుకొని గుంతలు తీసి పూడ్చామన్నారు.

ఇప్పటికైనా కాటికాపరి వృత్తి చేసే వత్తిదారులను నాలుగవ తరగతి ఉద్యోగస్తులుగా నియమించి, వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ధర్నా అనంతరం సచివాలయంలో ఉన్న ఒక్క అధికారినికి వినతి పత్రం ఇస్తే తీసుకోకపోవడంతో సచివాలయం గోడకే అతికించి నిరసన తెలిపారు. కెజిబిఎస్ గ్రామ నాయకులు చిన్న అయ్యస్వామి, ఈశ్వరి, ఏబు, శేఖర్, ఏసన్న, ఇమ్మానుయేల్, యేసు రాజు, లక్ష్మన్న తోపాటు 5 మేటిలకు సంబంధించిన15 మంది కాటికాపరులు పాల్గొన్నారు.





కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న కొత్త డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ

## రెవెన్యూ శాఖ ద్వారా మెరుగైన సేవలు


**డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని జిల్లా రెవిన్యూ అధికారి చాంబర్‌లో డిఆర్‌ఒగా ఆమె బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పెండింగులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖను మరింత ప్రక్షాళన చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష , జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్ కార్యాలయం జయశ్రీ తో పాటు రెవెన్యూ సూపరిండెంట్లు కలిసి అభినందనలు తెలిపారు.

## నిత్యావసర సరుకులు అందజేత

**ప్రజాశక్తి-పత్తికొండ :** పత్తికొండ టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న షేక్‌అలీ సాహెబ్ కూతురు చస్మికి షేక్ మహమ్మద్ సాహెబ్‌తో నిశ్చితార్థం జరిగింది. ఆయన కూలి పనులు చేసుకుంటూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మానవ దృక్పథంతో కెసిఆర్ మైత్రి చారిబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎస్.రామ్మోహన్ పెళ్లి కి కావలసిన నిత్యవసర సరుకులను అందజేశారు. రాబోయే రోజుల్లో ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు.



## ఉపాధ్యాయులను నియమించండి

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కట్టమంచి రామలింగారెడ్డి స్మారక మున్సిపల్ పాఠశాలలో కొరత ఉన్న ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి విద్యా కమిటీ చైర్మన్ దూదేకొండ కుమార్ డిఇఒకు విన్నవించారు. శుక్రవారం డిఇఒ శామ్యూల్ పాల్ ను వారు కలిసి వినతిపత్రం అందించారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు బోధన చేసేందుకు దాదాపుగా 15 మంది ఉపాధ్యాయులు అవసరమన్నారు. పాఠశాలలో నెలకొన్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు.

# పారిశుధ్యం అధ్వానం


## ● రోడ్డుపైనే మురుగునీరు ● సమస్యలు పట్టని సర్పంచి

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు.. గ్రామాల్లో అనేక సమస్యలు ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నాయి. మురుగు కాలువలు లేక నీరు రోడ్లపై, వీధుల్లో పారుతోంది. ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది రాత్రి వేళల్లో ఇళ్లపై దాడి చేస్తున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సర్పంచికి ఈ సమస్యలేవీ పట్టడం లేదు.


రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామానికీ రూ.లక్షల నిధులు మంజూరు చేసింది. వాటిని వినియోగించుకోవడానికి అధికారులు ఒక ప్రణాళిక సిద్ధం చేయలేకపోయారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాల్లో పర్యటించే తీరిక దొరకడం లేదు. కార్యదర్శులు, సర్పంచి గ్రామాల్లోని వీధుల గుండా పర్యటించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అడిగి తెలుసుకుని, నిధులను బట్టి పనులు చేపట్టాలి. కార్యదర్శులు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి పరిమితం కావడంతో గ్రామాల్లో సమస్యలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. చినుకు పడితే చాలు గ్రామాలు చిత్తడి చిత్తడిగా అవుతున్నాయి. మండలంలోని జాలమంచి గ్రామంలో తిమ్మప్ప స్వామి గుడి వద్ద కాలువలు శుభ్రంగా లేక రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. అప్పుడప్పుడు గ్రామాల్లో పని ఉంటే కార్యదర్శులు పంచాయతీ కార్యాలయానికి 'అలా వస్తారు.. ఇలా వెళ్తారు.' కార్యాలయానికి కార్యదర్శి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో దోమల నివారణకు పొగ వేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగాయని, సాయంత్రం అయితే ఇంటి బయట నిలబడే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కొద్దిపాటి మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లితే దోమలు వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు. కార్యదర్శులు గ్రామాలకు 'వచ్చామా.. వెళ్లామా' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే ప్రజల ఆగ్రహానికి అధికారులు గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.


అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

### గ్రామంలో పారిశుధ్యం అధ్వానం

**- గ్రామస్తుడు వెంకటేష్**

గ్రామంలో స్వచ్ఛభారత్ కింద నియమితులైన ముగ్గురు పారిశుధ్య కార్మికులను తొలగించి సంవత్సరంపైగా అవుతోంది. కొత్త వారిని నియమించకపోవడంతో గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా తయారయింది. కేంద్ర ప్రభుత్వం కింద మంజూరు చేసిన ట్రై సైకిళ్లను కూడా మూలన పడేశారు.

### తాగునీరందడం లేదు

**- గ్రామస్తుడు రాజు**

సర్పంచి, అధికారుల నిర్లక్ష్యంతో గ్రామానికి నాలుగు రోజులకోసారి తాగునీరు అందుతున్నాయి. కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు నుంచి రావాల్సిన పైపు లైన్ లీకులతో అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు, తాగునీటికి చొరవ చూపాలి.

## ప్రజలు లేకుండానే 'ప్రజా వేదిక'

● స్థానిక అధికారుల కనుసన్నల్లోనే సామాజిక తనిఖీ

● ఒకే కుటుంబంలో సభ్యులందరికీ విడివిడిగా జాబ్ కార్డ్

● కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజలు లేకుండానే ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని అధికారులు తూతూ మంత్రంగా చేపట్టారు. ఒకే కుటుంబంలో ఉన్న సభ్యులందరికీ విడివిడిగా జాబు కార్డులు మంజూరు చేస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. శుక్రవారం ఆదోనిలోని ఉపాధి కార్యాలయం ముందు సామాజిక తనిఖీ చేపట్టారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతూ సాఫీగా అవినీతిని కొనసాగిస్తున్నారు. ఎండలో మట్టి పని చేసిన వారి రిజిస్టర్‌లోని దినములను ఏమారుస్తూ ఉపాధి హామీ కూలీల పొట్ట కొడుతున్నారు. ఈ విధంగా ఉండగా సంవత్సరానికి ఒకసారి సామాజిక తనిఖీలో ఉపాధి సిబ్బంది పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆడిట్ సిబ్బంది గుర్తించారు. 17వ విడత సామాజిక తనిఖీలో ఈ విషయం తేటతెల్లమైంది. అవినీతి జరిగిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని పీడీ పేర్కొన్నారు. ప్రతేడాది ఇలాగే పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రాత్రి 8 గంటలైనా ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. డ్వామా పీడీ నాసరరెడ్డి, అడిషనల్ పీడీ మాధవిలత, ఏపీడీ లోకేశ్వర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శ్రీలత, సిడిసిఎల్ ఆర్‌సి ఆదినారాయణ, స్టేట్ టెక్నికల్ ఆఫీసర్ కోనయ్య, ఎంపిడిఒలు గీతావాణి, రాజేంద్రప్రసాద్, ఎపిఒ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి ఎపిఒ కలిక్ పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం

● మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ కృష్ణ

**ప్రజాశక్తి - ఆదోని**


భోజనం నాణ్యత గురించి ఆరా తీస్తున్న చైర్మన్, కమిషనర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో మెనూ ప్రకారమే భోజన సదుపాయం కల్పించాలని మున్సిపల్ చైర్మన్ శాంత, కమిషనర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని శ్రీనివాస్ భవన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తూ, స్వచ్ఛమైన నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పప్పు, కూరగాయ చప్పగా ఉందని కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు. టోకెన్ల కొరత రాకుండా అడిగిన వారందరికీ ఇస్తూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఇవ్వాలని, ఇబ్బందులకు గురి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని నిర్వాహకులకు సూచించారు.

## పరిసరాల పరిశుభ్రత అవసరం

● విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు

● డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కర్

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

ప్రతి శుక్రవారం గ్రామాల్లో ప్రజలు ఫ్రైడే డ్రై డేను పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కర్ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో ఆరోగ్య సిబ్బంది నిర్వహించే డ్రైడేను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో ప్రసవాల వివరాలు, వాటికి సంబంధించిన జనన ధ్రువపత్రాల రికార్డులను పరిశీలించారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి శుక్రవారం గ్రామాల్లో ప్రజలు డ్రైడేను పాటించి ఇంటి పరిసరాలతో పాటు నీటి ట్యాంకులు, తొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములలో ఉన్న నీటిని పారబోసి శుభ్రపరచుకోవాలని తెలిపారు. డిడిఒ రవళి, వైద్యులు కార్తీక్, రజిత పాల్గొన్నారు.


వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

## శారీరక పరిశుభ్రత పాటించాలి

● ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు

**ప్రజాశక్తి - ఆదోని**


మాట్లాడుతున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు

యుక్త వయస్సు అమ్మాయిలు శారీరక పరిశుభ్రత పాటించి, పలు రకాల రుగ్మతలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదోని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని కళాశాల బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు బియాన్ డోనర్, ఆదోని ప్రభుత్వాస్పత్రి సహాయంతో అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బియాన్ డోనర్ చేపట్టిన ఈ కార్యక్రమానికి, ఆరోగ్య పరమైన సలహాలు ఇస్తూ ఆదోని ఆస్పత్రిలో ఉన్న ప్రముఖ వైద్యుల సహాయంతో నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ఆర్ఎంఒ డాక్టర్ జగదీష్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్, సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సృజన, డాక్టర్ ప్రియాంక, బియాన్ డోనర్ సభ్యులు శివమణి, డాక్టర్ భరత్ మాట్లాడారు. నెలవారీ రుతుస్రావ సమయంలో శుభ్రత పాటించాలని సూచించారు. నిర్లక్ష్యం చేయడం వల్ల బ్యాక్టీరియా చేరి క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. గర్భ సంచికి పుండు ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు.

## వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి - హాలహర్వి**

మండల పరిషత్ సమావేశంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపిడిఒ వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపిపి నెట్టికంటమ్మ అధ్యక్షత వహించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను వివరించారు. వీటిపై ప్రజాప్రతినిధులు పంచాయతీల్లో సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు పట్టారు. అనంతరం 21వ అఖిల భారత పశుగణన గోడపత్రికను మండల పశు వైద్యాధికారి డాక్టర్ జి.అశోక్ కుమార్ విడుదల చేశారు. ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరి వరకు మండలంలో ఉండే పశువులను, ఇతర జీవులను పశు గణన చేపడుతామని పశు వైద్యాధికారి తెలిపారు. వైస్ ఎంపిపి నాగేష్, ఎఒ శివశంకర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, అధికారులు

## 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఐఎఫ్‌టియు

**ప్రజాశక్తి - ఆదోని**

రాయలసీమ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఐఎఫ్‌టియు డివిజన్ నాయకులు నరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకప్ప మాట్లాడారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కుమార్, బాష, నారాయణప్ప, కృష్ణ, రుక్మిణి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలి

- వాటర్ షెడ్ ద్వారా భూగర్భ జలాలు పెంచుకోండి

- నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అబూవరాజన్

**ప్రజాశక్తి- దేవనకొండ**


వాటర్ షెడ్ పథకాన్ని ప్రారంభిస్తున్న నాబార్డ్ అధికారులు

నాబార్డ్ ఆర్థిక సహాయంతో మంజూరైన వాటర్ షెడ్డు పథకాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామస్తులందరూ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అబూవరాజన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మాదాపురం గ్రామంలో వాటర్ షెడ్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో వాటర్ షెడ్ పథకంపై సర్పంచి హనుమంతు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి, బ్యాంకులకు తక్కువ వడ్డీలకు రుణాలను మంజూరు చేసి వచ్చిన వడ్డీల ద్వారా నిధులను కరువు ప్రాంతాల్లో వెనుకబడిన గ్రామాల అభివృద్ధికి నాబార్డ్ ద్వారా సహాయం చేస్తున్నట్లు తెలిపారు. వాటర్ షెడ్ పథకం ద్వారా కరువు ప్రాంతాల్లో వర్షపు నీటిని నిల్వ ఉంచి భూగర్భ జలాలను పెంపొందించడం, రైతుల పొలాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలోని 1000 హెక్టార్ల భూమిని గుర్తించామని, మొదటి విడతగా రూ.16 లక్షలతో 100 హెక్టార్ల రైతుల భూముల్లో రాతి కట్టడాలు, కుంటలు, మట్టి కత్వాలు, చెక్ డ్యామ్ వంటి పనులను చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను గ్రామస్తులు విజయవంతం చేసుకుంటే మిగిలిన 900 హెక్టార్లలో వాటర్ షెడ్ గ్రామ కమిటీ ద్వారా పనులు గుర్తిస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలో వాటర్ షెడ్ పథకం ద్వారా చేపట్టిన రాతి కట్టడాలను, కుంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, కెడిసిసి బ్యాంకు జనరల్ మేనేజర్ రామాంజనేయులు, సిఇఒ విజయకుమార్, ఆప్కాబ్ మేనేజర్ నహేదా సుల్తానా, నవయుత అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, సిఇఒ నరసింహులు పాల్గొన్నారు.

## మహిళా అభ్యుదయమే ధ్యేయం

- తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**



మహిళా అభ్యుదయమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా మహిళలకు అందించే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి రిజిస్ట్రేషన్, బుకింగ్ ప్రారంభమయ్యాయని తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేసి వారి కళ్లలో ఆనందం నింపడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.

## యురేనియం తవ్వకాలను నిలిపేయాలి

- డివిఎంసి సభ్యులు కాకర్ల శాంతికుమార్

**ప్రజాశక్తి - దేవనకొండ**

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలను చేపట్టరాదని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతి కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా ఫారెస్ట్ అధికారి శ్యామలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యురేనియం తవ్వకాలు చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేసినట్లు ప్రచారం జరగడంతో కొండ చుట్టూ గ్రామాల ప్రజలు భయందోళనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలో హంద్రీనీవా కుడి కాలువ ద్వారా 46 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని, ఇప్పుడిప్పుడే రైతులు వ్యవసాయ రంగంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఈ తరుణంలో యురేనియం తవ్వకాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. గతంలో ఫాక్షన్‌తో కప్పట్రాళ్ల గ్రామంలో రక్తపుటేరులు ప్రవహించాయని, ప్రస్తుతం హంద్రీనీవా ద్వారా రైతులు వ్యవసాయమే ఆధారంగా జీవితం ప్రశాంతంగా గడుపుతున్నారని తెలిపారు. యురేనియం తవ్వకాల ద్వారా ప్రజా జీవనం ఛిన్నాభిన్నమై మండలవ్యాప్తంగా కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి యురేనియం తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కోరారు. టిడిపి నాయకులు పి.కోటకొండ మల్లెపల్లి రంగుడు, దేవనకొండ సంపత్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న శాంతికుమార్

## పకడ్బందీగా పశుగణన

● సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**ప్రజాశక్తి - ఆదోని**

పశుగణనను పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం సబ్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే '21వ అఖిలభారత పశుగణన' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ, పట్టణ పరిధిలో పశుపోషకులను సంప్రదించి వాటి వివరాలను నమోదు చేయాలని సూచించారు. డిప్యూటీ పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రదీప్ కుమార్, విఎల్‌ఒ సాయిబాబా పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని నగరూరు, చిగిలి, అట్టేకల్లు గ్రామాల్లో పశువైద్యులు శ్రావణ్ కుమార్, రాజు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ మురళీ మోహన్ రావులు 21వ అఖిల భారత పశుగణనను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పశుగణనను వచ్చే ఏడాది ఫిబ్రవరి చివరి వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమగ్రమైన పశుగణన గణాంకాలు ఉంటేనే, ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయని చెప్పారు. రైతులు గ్రామాల్లో పశుగణన కోసం వచ్చే సిబ్బందికి సహకరించి పశువుల వివరాలు తెలియజేయాలన్నారు. అనంతరం పశుగణన గోడపత్రికను విడుదల చేశారు. సర్పంచులు లతాశ్రీ, సావిత్రమ్మ, మాజీ సర్పంచి రామకృష్ణప్ప, మాజీ ఎంపిటిసి శివ కుమార్, పశుసంవర్ధక సహాయకులు వినోద్ కుమార్, రాము పాల్గొన్నారు. **గోనెగండ్ల** ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ మణిమంజరి, గోనెగండ్ల పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పశుగణన గోడపత్రికను విడుదల చేశారు. సర్పంచి హైమావతి పాల్గొన్నారు. **ఆలూరు** ఎంపిడిఒ కార్యాలయంలో డాక్టర్ విజయ్ నాయక్ ఆధ్వర్యంలో పశుగణన గోడపత్రికను విడుదల చేశారు. ఎంపిపి రంగమ్మ, పశుసంవర్ధక శాఖ ఏడీ విక్టర్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రమాదేవి పాల్గొన్నారు.


ఆదోనిలో గోడపత్రికను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్


ఆస్పరిలో గోడపత్రికను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్


ఆలూరులో...


గోనెగండ్లలో...

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఆందోళన

- ఎస్ఎఫ్ఐ నాయకులు

**ప్రజాశక్తి - ఆదోని**

విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 28, 29, 30న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని కోరారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, జిఒ 77ను రద్దు చేసి పిజి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని కోరారు. తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గౌస్, నాయకులు శశిధర్, మల్లికార్జున, లోకేష్, ఉచ్చీరప్ప, రాజు, ఫారిక్ బాష, గణేష్ పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం నాలుగో క్లస్టర్ వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు పారిశుధ్య పనులను చేస్తూ పట్టణ పరిశుభ్రతకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారని, వారికి వేతనాలు పెంచాలని కోరారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు జె.నాగరాజు, కేశన్న, తిక్కయ్య, రంగన్న, శాంతప్ప, సోమన్న, ఈరన్న, ఉరుకుందు, ముఖేష్, లక్ష్మన్న, మహేష్ నాయుడు, యోహాన్, తిమోతి, దేవరాజు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## మీనాక్షి నాయుడు పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - ఆదోని రూరల్**


పేదలకు ఆహారం వడ్డిస్తున్న శ్రీనివాస్ ఆచారి

మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో మూడు పూటలు పేదలకు భోజన సదుపాయం కల్పించినట్లు టిడిపి 19వ వార్డు ఇన్‌ఛార్జి శ్రీనివాస్ ఆచారి తెలిపారు. తెలుగు యువత నాయకులు భూపాల్ చౌదరి చేతులమీదుగా అక్కడ వచ్చిన వారికి భోజన వసతి కల్పించామన్నారు. శ్రీనివాస్ ఆచారి చేతులమీదుగా జీవనజ్యోతి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. మీనాక్షి నాయుడు మరిన్ని పదవులు చేపట్టి ఆదోని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. నాయకులు మల్లికార్జున, ఫిలిప్ ఉన్నారు.

## టిడిపిలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం

- నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్

**ప్రజాశక్తి - ఆదోని**


సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

టిడిపి హయాంలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం ఉంటుందని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డెమాన్ గోపాల్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లె శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా అరుదైన గౌరవం దక్కిందని తెలిపారు. నాయీ బ్రాహ్మణులను అన్ని దేవాలయాల పాలకమండలిలో సభ్యులుగా అవకాశం కల్పించే విధంగా కేబినెట్ మీటింగ్‌లో తీర్మానం చేసినట్లు చెప్పారు. బీసీలకు నష్టం జరగకుండా భవిష్యత్తులో నాయీ బ్రాహ్మణులకు కూడా నష్టం జరుగకూడదని రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయీ బ్రాహ్మణులు భవిష్యత్తులో టిడిపి వెంటనే నడుస్తారని చెప్పారు. ఇంకా వేరే నామినేట్ పోస్టుల్లో కూడా తమకు అవకాశాలు కల్పించాలని, కో ఆప్షన్ మెంబర్లుగా కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

## సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాశక్తి - ఆస్పరి**



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషనల్‌లో భాగంగా ఇండస్ట్రియల్ ఫీల్డ్ విజిట్‌ను ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి నిర్వహించారు. ఆస్పరి గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయ పనితీరును, ప్రయోజనాలను సచివాలయం సిబ్బంది ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాగా చదవడం ద్వారా విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయని సూచించారు. వృత్తి విద్య ఉపాధ్యాయులు రాజు, శివకుమార్, ఉపాధ్యాయులు పరమేశప్ప, ఆనంద్ పాల్గొన్నారు.

## కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించాలి

- కెజిబిఎస్ నాయకులు

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

శ్మశానంలో వృత్తి నిర్వహించే కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించాలని కాటి కాపరులు గుంతలు తీసే బేగరుల సంఘం (కెజిబిఎస్) నాయకులు డిమాండ్ చేశారు. కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని నాయకులు సుంకన్న, జయరాజు, శాంతిరాజు, కరుణాకర్, దినకర్, రత్నమయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రబాడు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహించే వారి జీవితాలకు, ఆరోగ్యాలకు భద్రత, భరోసా లేదని తెలిపారు. ప్రభుత్వం వారిని గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

- తహశీల్దార్ గోవిందు సింగ్

**ప్రజాశక్తి - ఆలూరు**

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ గోవిందు సింగ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగస్కల్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రీ సర్వే వల్ల ఏర్పడిన ఇబ్బందులు, సాంకేతిక సమస్యలను గ్రామ సభల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించి తగిన న్యాయం చేస్తామని తెలిపారు. మండల సర్వేయర్ అరుణ జ్యోతి, విఆర్‌ఒలు రవి, రామకృష్ణ, ఆనంద్, లింగన్న పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు (రూరల్)** మండలం తిమ్మాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ శేష ఫణి, డివిజన్ సర్వేయర్ శ్రీనివాసరాజు, మండల సర్వేయర్ వహీద్, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ జ్యోతిర్మయి పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి కర్నూలు పార్లమెంట్ కురువ సాధికార కమిటీ మెంబర్ కెటి.వెంకటేష్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులకు అవసరం ఉన్నా, లేకున్నా భూములను బలవంతంగా శాటిలైట్ ద్వారా కొలిచారని, భూముల కొలతల్లో వ్యత్యాసం వచ్చిందని తెలిపారు. రైతులకు ఆస్తి నష్టం జరిగి, గ్రామాల్లో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకుంటూ, భౌతిక దాడులు చేసుకుంటున్నారని చెప్పారు. రైతుల మధ్య ఉన్న భూ సమస్యలను తహశీల్దార్ పరిష్కరించాలని, ఇరువురి రిజిస్టర్ డాక్యుమెంట్లు పరిశీలించాలని కోరారు. టిడిపి నాయకులు రంగయ్య, ఉరుకుందు పాల్గొన్నారు.


ఆలూరులో మాట్లాడుతున్న తహశీల్దార్ గోవిందు సింగ్


ఎమ్మిగనూరులో